# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఎర్రచందనం అమ్మకాలు, ఎగుమతుల కోసం రాష్ట్ర అటవీ శాఖను నోడల్ ఏజెన్సీగా నియమించాలని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.
- ❖ పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి ఎస్. సవిత తెలిపారు.
- ❖ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఉప సభాపతి రఘురామ కృష్ణం రాజు ఈరోజు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో సమావేశమయ్యారు.

=========================

ఎర్రచందనం అమ్మకాలు, ఎగుమతుల కోసం ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖను నోడల్ ఏజెన్సీగా నియమించాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఈరోజు న్యూఢిల్లీలో కేంద్ర పర్యావరణ, అటవీశాఖా మంత్రి భూపేందర్ యాదవ్‌తో సమావేశమై ఎర్రచందనం పరిరక్షణ, తదితర అంశాలపై చర్చించారు. స్వాధీనం చేసుకున్న కలపను స్వదేశానికి రప్పించడానికి, రాష్ట్ర అటవీ శాఖకు అధికారం ఇచ్చేందుకు సహకరించాలని కోరారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం వేలం నిర్వహణకు నోడల్ ఏజెన్సీగా రాష్ట్ర అటవీ శాఖను నియమించాలన్న నాన్ - డెట్రిమెంట్ ఫైండింగ్ (NDF) నివేదికను అమలు చేయాలన్నారు. ఈ క్రమంలో కేంద్రం నిబంధనలను సవరించి రాష్ట్రం వెలుపల పట్టుబడిన ఎర్రచందనం సైతం సింగిల్ విండో వేలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే దక్కేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని కోరారు.

(వాయిస్ 28 సెకన్లు)

=========================

ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. ఏపీ ఖాదీ గ్రామీణ బోర్డు చైర్మన్ గా నియమితులైన కేకే చౌదరి చేత మంత్రి ఈరోజు విజయవాడలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందుకోసం ఎంఎస్ఎంఈ, ఖాదీ గ్రామీణ బోర్డు ద్వారా యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు, సబ్సిడీ రుణాలు అందజేయనున్నామన్నారు. రాష్ట్రంలో రాబోయే 5 సంవత్సరాల్లో 20 లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ప్రతి జిల్లాలోనూ, నియోజకవర్గంలోను విరివిగా యూనిట్లు ఏర్పాటు చేసి, ఉపాధి అవకాశాలు మెరుగు పరచనున్నట్టు చెప్పారు. యూనిట్ల ఏర్పాటు, సబ్సిడీ రుణాల మంజూరుపై ప్రతి నియోజక వర్గంలోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులపై ఆయా ప్రాజెక్టుల సిఈలు, ఎస్ఈలు, కాంట్రాక్ట్ ఏజెన్సీల ప్రతినిధులతో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశమయ్యారు. పోలవరం టన్నెల్స్ బ్యాలెన్స్ పనులు, ఎడమ కాలువ పనుల పురోగతిపై సమీక్షించారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి తెలుసుకునేలా వెబ్‌సైట్ లో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. హంద్రీ - నీవా, వెలిగొండ, చింతలపూడి తదితర ప్రాధాన్య ప్రాజెక్టుల పనుల ఆర్థిక ఇబ్బందులను అధిగమించి త్వరిత గతిన పూర్తి చెయ్యడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సమావేశంలో నిర్ణయించారు. సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

==========================

ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఉప సభాపతి రఘురామ కృష్ణం రాజు ఈరోజు ఢిల్లీ పార్లమెంట్ హౌస్‌లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. త్వరలో జరగనున్న 16వ ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ నూతన సభ్యుల అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఓం బిర్లాను ఆహ్వానించారు. ఓం బిర్లా ఆ ఆహ్వానాన్ని స్వీకరించి, ప్రతిపాదిత అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి లోక్‌సభ కార్యాలయం ద్వారా అవసరమైన అన్ని సహాయాలు అందించనున్నట్టు హామీ ఇచ్చారు.

విరామం

==========================

ప్రకృతి వ్యవసాయంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని, రైతులకు అవగాహన కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. వ్యవసాయ, ఉద్యాన, సూక్ష్మ సేద్య విభాగాల అధికారులతో ఈరోజు ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రకృతి వ్యవసాయంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. అధిక దిగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. పత్తి వంటి పంటల్లో అంతర పంటలతో రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు.

==========================

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ ఈరోజు కాఫీ బోర్డు, డిఆర్ డిఏ తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ అంశంపై మరింత సమాచారాన్ని అల్లూరి జిల్లా ఆకాశవాణి ప్రతినిధి అందిస్తారు.

(వాయిస్ 30 సెకన్లు)

========================

చిత్తూరు జిల్లా కుప్పంలో సర్వసభ్య సమావేశం దేశంలోనే మొదటిసారి దృశ్యమాధ్యమ విధానంలో నిర్వహించారు. కుప్పం మండల ఎంపిడిఓ సాయిలహరి ఆధ్వర్యంలో మండల పరిధిలోని 29 గ్రామ సచివాలయాలను అనుసంధానం చేస్తూ... జరిగిన ఈ సమావేశంలో శాసనమండలి సభ్యులు శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇప్పటికే 21 గ్రామ సచివాలయాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్సీ తెలిపారు. వర్చువల్ ఇంటరాక్షన్ ద్వారా సచివాలయాలను పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తూ ప్రజలకు పారదర్శకంగా పాలన అందిస్తామన్నారు.

========================

బాల్య వివాహాలను నిర్మూలించడమే ప్రధాన లక్ష్యమని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి అన్నారు. ఆమె ఈరోజు ఢిల్లీ నుండి ఆమె దృశ్యమాధ్యమ విధానంలో నిర్వహించిన "బాల్ వివాహ్.. ముక్త్ భారత్.." కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా... బాల్య వివాహ్ ముక్త్ భారత్ లక్ష్యం కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆకాంక్ష అని కేంద్ర మంత్రి తెలిపారు. దేశ వ్యాప్తంగా బాల్య వివాహాలను నిర్మూలించే ప్రయత్నాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం "బాల్ వివాహ ముక్త్ భారత్" ప్రచార కార్యక్రమాన్ని  ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలను వ్యతిరేకించి విజయం సాధించిన 9 మంది పిల్లలతో కేంద్ర మంత్రి దృశ్యమాధ్యమ విధానంలో మాట్లాడి, వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అలా ఎంపిక చేసిన 9 మంది పిల్లలలో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుంచాల కురమయ్యపేట గ్రామానికి చెందిన బుచ్చ రమణమ్మతో కేంద్ర మంత్రి మాట్లాడారు.

========================

విశాఖ జిల్లా పరవాడ ఫార్మాసిటీ లోని ఒక లేబరేటరీలో జరిగిన ప్రమాదంలో అస్వస్థతకు గురైన సిబ్బంది ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో మాట్లాడారు. హైడ్రోక్లోరిక్ యాసిడ్ లీక్ అయిన ఘటనలో ఒకరు చనిపోగా, ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని... వారికి అత్యవసర చికిత్స అందిస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. అస్వస్థతకు గురైన వారిలో మరో ఆరుగురి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వారికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామని చెప్పారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. అలాగే...  ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా వారికి సాయం అందించాలని సూచించారు.

========================

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వనిధి పథకం వీధి వ్యాపారులకు ఆర్థికంగా చేయూతనిస్తుందని ప్రకాశం జిల్లా మెప్మా పథక సంచాలకులు రవికుమార్ అన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పీఎం స్వనిధి పక్షోత్సవాల్లో భాగంగా ఈరోజు వీధి వ్యాపారులు, పొదుపు సంఘాల ఆర్.పి.లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... పీఎం స్వనిధి పథకం ద్వారా డిజిటల్ విధానంలో సులువుగా రుణం పొందవచ్చన్నారు. జిల్లాలో ఈ పథకం కింద ఇప్పటివరకు 17 వేల 734 మందికి రుణాలు అందజేశామన్నారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ డిప్యూటీ హెడ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ... మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి యూనియన్ బ్యాంక్ ఎల్లప్పుడూ ముందు ఉంటుందన్నారు.

========================

========================